

13




ఉపాధి హామీ కూలీలపై
'ప్రభాత సమాచారం'లో ప్రచురితమైన కథనం

# 'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

- కదిలించిన కథనం.. కదిలిన అధికార యంత్రాంగం
- ప్రభాత సమాచారం కథనానికి స్పందన
- కూలీలు తక్కువగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం
- ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

మంగళవారం | 20 మే 2025 | 13 పేజీలు




8లో

# భవనం భద్రమేనా..?

## ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా అనేకం



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- ఏదైనా ఘటన జరిగితేనే అధికారుల హడావిడి
- తరువాత 'మామూలు'గా వ్యవహరిస్తున్న అగ్నిమాపక శాఖ..
- షాపింగ్ కాంప్లెక్స్‌లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్లలో కనిపించని ఫైర్‌సేఫ్టీ
- విద్యా సంస్థల పరిస్థితి దారుణం.. గొర్ల చావిడిలా హాస్టల్ గదులు
- ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలుండే అవకాశం
- చార్మినార్ ఘటన నేపథ్యంలో చర్చనీయాంశంగా మారిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భవనాల అంశం..

వర్తక, వ్యాపార, వాణిజ్యాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేరాఫ్‌గా నిలుస్తుండటం.. రోజురోజుకూ నగర, పట్టణ ప్రాంతాలు విస్తరిస్తుండటం.. అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలు చకచకా జరిగిపోతుండటం అభివృద్ధికి మెట్టుగా భావిస్తున్నా.. లోప భూయిష్టంగా జరుగుతున్న అనేక నిర్మాణాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. రెండు రోజుల క్రితం చార్మినార్ గుల్జార్ హౌస్ వద్ద ఘోర అగ్ని ప్రమాదం నేపథ్యంలో మన జిల్లాల్లో ఉన్న భవనాల భద్రతపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన బహుళ అంతస్తుల్లో వివిధ వ్యాపారాలు, ఆస్పత్రులు, అపార్ట్ మెంట్లు, హాస్టళ్లు, ఫంక్షన్ హాళ్లు, విద్యా సంస్థలు కొనసాగుతుంటే.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.




4

### అవినీతి నిర్మూలనలో ప్రజల

# భాగస్వామ్యం అవసరం

- మంచిర్యాల, కుమ్రంభీం జిల్లాలకు ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది..
- లంచం అడిగితే 1064 నంబర్‌కు ఫిర్యాదు చేయండి
- వెబ్ సైట్‌లో కూడా ఫిర్యా దు చేసే వెసులుబాటు..
- మంచిర్యాల జిల్లాలో ఏసీబీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి

సమాజంలో నెలకొన్న అవినీతి నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో ముఖ్యమని ఏసీబీడైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలోని సీసీసీ టౌన్‌షిప్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తరుణ్ జోషి మాట్లాడారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల కేసులకు సంబంధించి ఇక నుంచి ఇక్కడే ఫిర్యాదు చేయవచ్చునన్నారు. నిరంతరం అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇది వరకు ఆదిలాబాద్‌లో కార్యాలయం ఉన్నందున ఇక్కడి నుంచి వచ్చే ఫిర్యాదు దారులు ఇబ్బందులు పడ్డారని, కేసుల పరిశోధనలో అధికారులూ ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాలలో కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.



5

### అవాంఛనీయ ఘటనలు జరగకుండా

# చర్యలు చేపట్టాలి

- డీజీపీ (పర్సనల్) అనిల్ కుమార్
- సోషల్ మీడియాలో జరిగే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలి
- రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలను అరికట్టాలి..
- పోలీసు కార్యాలయం పరిశీలన
- జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని డీజీపీ (పర్సనల్) అనిల్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియాలో జరిగే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని అధి కారులను ఆదేశించారు. హెచ్‌ఎర్‌ఎంఎస్ అప్లికేషన్ సిబ్బంది వినియోగించేలా చూడాలన్నారు.

### మందమర్రిలో

5లో

# పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- భారీ శబ్ధంతో ఒక్కసారిగా ఎగిసి పడ్డ మంటలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీసిన స్థానికులు



2

### కాళ్లతో పరీక్ష రాశాడు..

# అంగవైకల్యాన్ని జయించాడు

బెల్లంపల్లి పట్టణంలోని ఓ విద్యార్థి రెండు చేతులు లేకున్నా పరీక్ష రాసి తన అంగవైకల్యాన్ని జయించాడు. సదరు విద్యార్థి ఓ ప్రమాదంలో తన రెండు చేతులను కోల్పోయాడు. అధైర్య పడకుండా తోటి విద్యార్థులతో పరీక్షకు హాజరయ్యాడు. రెండు కాళ్ళతో పరీక్షరాసి తానేమి తక్కువ కాదని చాటి చెప్పాడు.

### ఆర్టీసీ ప్రయాణికులకు

# మెరుగైన సేవలు

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. ఆదిలాబాద్ డిపోను సోమవారం ఆయన సందర్శించారు. ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా డిపో ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకంతో మహిళలు ఎంతో లబ్ధి పొంతున్నారని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రతీ గ్రామానికి బస్సు నడిపేలా చర్యలు తీసు కుంటామన్నారు.

వివరాలు 13లో







# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణిలో వచ్చిన ప్రజల దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, వైద్యం, విద్య, వ్యవసాయం, భూ వివాదాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల మంజూరు, పింఛను, తదితర సమస్యల పరిష్కారానికి ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పరిష్కార వివరాలను దరఖాస్తుదారులకు అందించడంతో పాటు, సంబంధిత ఫైళ్లలో స్పష్టమైన రిమార్కులు చేర్చాలని ఆదేశించారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రారంభించిన టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కలెక్టర్ తెలిపారు. ఫోన్ ద్వారా వచ్చిన అర్జీలను నమోదు చేసి, వాట్సాప్ ద్వారా రసీదు పంపే విధానాన్ని అమలు చేశారు. జిల్లా లో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులోగా అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని, మండల ప్రత్యేకాధికారులు మండల స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల పరిశీలన, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చేరిక పెంచే చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 104 దరఖాస్తులు

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఈ సందర్భంగా 104 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి, ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్జీదారుల దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్జీకి సంబంధించిన సమస్య వివరాలను క్లుప్తంగా అర్థమయ్యేలా వారికి వివరించాలన్నారు. ఈ గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని అర్జీదారులను పదేపదే రాకుండా చూడాలని ఆదేశించారు.

### కాళ్లతో పరీక్ష రాశాడు

# అంగవైకల్యాన్ని జయించాడు

**బెల్లంపల్లి, మే 19 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని ఓ విద్యార్థి రెండు చేతులు లేకున్నా పరీక్ష రాసి తన అంగవైకల్యాన్ని జయించాడు. బెల్లంపల్లి డిగ్రీ కళాశాలకు డిగ్రీ ఫస్ట్ ఇయర్ పరీక్ష కేంద్రానికి రెండు చేతులు కోల్పోయిన ఏలూరు శంకర్ పరీక్ష రాయడానికి వచ్చాడు. సదరు విద్యార్థి ఓ ప్రమాదంలో తన రెండు చేతులను కోల్పోయాడు. అయినప్పటికీ అధైర్య పడకుండా, నిరాశ చెందకుండా తోటి విద్యార్థులతో కలిసి పరీక్ష రాయడానికి హాజరయ్యాడు. రెండు కాళ్ళతో పరీక్షరాసి తానేమి తక్కువ కాదని చాటి చెప్పాడు. పరీక్ష రాసిన విద్యార్థి నెన్నెల మండలం కుష్ణపల్లి గ్రామనివాసి. కాగా ఏలూరి శంకర్ గత పదిసంవత్సరాల క్రితం జరిగిన ఓ విద్యుత్తు ప్రమాదంలో తన రెండు చేతులను కోల్పోయాడు. ఎల్లూర్ శంకర్ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ అభ్యసిస్తున్నాడు. కృషి పట్టుదల లక్ష్య సిద్ధి ఉంటే సరి పరీక్ష ఎలాగైనా రాయచ్చని చేతులు లేని శంకర్ కాళ్లతో పరీక్ష రాసి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడనడంలో సందేహం లేదు.



## బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్‌పై కేసు నమోదు




**ఉట్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అధికార పార్టీ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 2023 నవంబర్‌లో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వస్తున్న జాన్సన్ నాయక్‌ను ఉట్నూర్ మండలం కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద కాంగ్రెస్ నాయకులు అడ్డగించి హంగామా సృష్టించి కేసు పెట్టారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. 19 నెలల తరువాత ఉట్నూర్ పోలీసులు జాన్సన్ నాయక్‌కు నోటీసులు అందజేయడం కక్షసాధింపు చర్య అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ స్పందిస్తూ అధికార పార్టీకి చెందిన నాయకులు తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, రెట్టింపు ఉత్సాహంతో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



### గోలేటి 1-ఏ ఓపెన్ కాస్టును

## త్వరగా ప్రారంభించాలి

### సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

**తాండూర్, మే 19 (ప్రభాత సమాచారం)**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి 1-ఏ ఓపెన్ కాస్టును త్వరతగతిన ప్రారంభించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సిఎండి కార్యాలయంలో సింగరేణి సిఎండి బలరాం నాయక్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ గోలేటి 1ఏ ఓపెన్ కాస్టు ప్రారంభమైతే ప్రత్యక్షం, పరోక్షంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎండీ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

## కాంగ్రెస్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

**ఉట్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్య తీసుకోవాలని ఉట్నూరు బీజేపీ మండల శాఖ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఉట్నూర్ ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ... భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాకిస్తాన్‌కు సరైన బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. దేశభద్రత కోసం ఎంతవరకైనా తెగిస్తామని చెప్పడం ప్రపంచ దేశాలు నరేంద్ర మోడీ వైపు చూస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మన దేశంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, లింగాగౌడ్, జితేందర్, భీమన్న ఉన్నారు.




## వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతోంది



**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**
రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ ఒక యజ్ఞంలా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా దిగుబడి రావలసి ఉండగా జిల్లాలో ఏర్పాటు చేసిన 345 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరిందని, 36 కొనుగోలు కేంద్రాలు సేకరణ లక్ష్యం పూర్తి చేసి మూసి వేయడం జరిగిందన్నారు. జిల్లాలో 7వేల మంది రైతుల ఖాతాలలో 108 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని, ధాన్యం సేకరణలో జిల్లాలోని 20 మిల్లులు, కరీంనగర్లోని 64 మిల్లులే కాకుండా పెద్దపల్లి జిల్లాలోని మిల్లులకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించబడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 1.5 సెంటీమీటర్ల వర్షం పడిందని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని తెలిపారు. జిల్లాలోని 345 కొనుగోలు కేంద్రాలలో ఒక కేంద్రానికి 15-20 మంది చొప్పున 5175-6900 మంది హమాలీలు, 1725 మంది సిబ్బంది, 18 మంది తహశిల్దార్లు, 18 మంది మండల ప్రత్యేక అధికారులు, 18 మంది వ్యవసాయ అధికారులు, 85 మంది విస్తరణ అధికారులు, పౌరసరఫరాల అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి, సహకార శాఖల అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్, కలెక్టర్ లతో కలిపి మొత్తం 7 వేల మందికి పైచిలుకు అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను యజ్ఞం లాగా కొనసాగిస్తున్నారని, త్వరలోనే సేకరణ ప్రక్రియ ముగిసే దశలో ఉందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 6303928683 నంబర్‌ను అందుబాటులో ఉంచి 24/7 సేవలు అందించడం జరుగుతుందని, గోనె సంచులు 62.50 లక్షలు అవసరం కాగా 52.09 లక్షలు కలిగి ఉండి 45.43 లక్షల సంచులు కొనుగోలు కేంద్రాలకు అందించగా 6.63 లక్షల సంచులు గోదాములో ఉన్నాయని, ప్రతి రోజు 1 లక్షా 50 వేల సంచులు రాష్ట్రం నుండి వస్తున్నాయని తెలిపారు. గతంలో లేని విధంగా 3 సెకార్లను 4 సెక్టార్లుగా పెంచి 400 పైచిలుకు లారీలు అందుబాటులో తీసుకువచ్చామని, జిల్లాలో సింగరేణి సంస్థ ఉండటం వలన లారీల కొరత లేదని, లారీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో 20-30 చొప్పున మొత్తం 2 వేల 677 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, 1 వేయి 797 అదనంగా ఉన్నాయని, 164 ఆటోమేటిక్ ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు ఉన్నాయన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్, అదనపు కలెక్టర్ అందుబాటులో ఉంటారని, కాల్ సెంటర్లో సంప్రదించవచ్చున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**అధికారులు సమన్వంతో అర్జీలను పరిష్కరించాలి - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండలం తాళ్ల పల్లి గ్రామానికి చెందిన అక్కపురం రాజయ్య సింగాపూర్ గ్రామ శివారులో తనకు చెందిన భూమి సింగరేణి ఓపెన్ కాస్టులో పోయిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కామెర లక్ష్మి, మేస్త్రి కీర్తిమాల తమకు సొంత ఇంటి స్థలం ఉందని, ఇందిరమ్మ ఇండ్ల పథకంను వర్తింప చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన తిప్పని సాయితేజ తనకు గల భూమి ఆక్రమణకు గురవుతుందని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణం రైల్వేస్టేషన్ రడగంబాలబస్తీకి చెందిన యాదారి కవిత తమ వార్డులో అంగన్వాడీ కేంద్రం దూరంగా ఉండడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి మేఘన జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా తన భూమి కోల్పోతున్నానని, బాధితుల జాబితాలో తన వివరాలు లేవని, నమోదు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తన దరఖాస్తులో మందమర్రి మండల శివారులోని ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించి స్వాధీన పరుచుకుని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సం బంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బోరిగాం దళితులపై కేసులు ఎత్తివేయాలి

**ముథోల్, మే 19 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండలంలోని రాళ్లబోరిగాం గ్రామంలో జరిగిన ఘర్షణలో దళితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ సోమవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని దళితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. అదే విధంగా అక్కడ విగ్రహావిష్కరణ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటస్వామి, రంజిత్ కుమార్, గంగాధర్, కిరణ్, భూమేష్, రమేష్, భీమ్ ఆర్మీ నాయకులు సాహెబ్ రావ్, అంబేద్కర్ యువజన సంఘం, నాయకులు బోరిగాం గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లను పేదలకు కేటాయించాలి




**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**

నర్సాపూర్ మండల కేంద్రంలో పేద ప్రజల కోసం ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. దీనికి సిపిఎం సిపిఐ ఎంఎల్ పార్టీ సభ్యులు రాజు మద్దతు పలికి పేద ప్రజలకు ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేటాయించకపోవడం వల్ల కొత్త భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వెంటనే కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

**ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా**



**ఉట్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**

గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం మార్కగూడ గ్రామానికి చెందిన మధు తమ గ్రామానికి సోలార్ విద్యుత్ సౌకర్యం కలిపించమని, తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన గేడం శంకర్ బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. ఆదిలాబాద్ మండలం ఖండల గ్రామానికి చెందిన శ్రీదేవి తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని కోరారు. పింఛన్,ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీవో మెస్రంమనోహర్, ఏవో దామోదర స్వామి మనోహర్, ఈఈ తానాజీ, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 'హామీలు అమలు చేయాలి'

**లక్షెట్టిపేట, మే 19 (ప్రభాత సమాచారం)**

కోయపోచగూడెంను పోడు లిస్టులో చేర్చి హక్కు పత్రాలు ఇవ్వాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి రంజిత్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్, రంజిత్ కుమార్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... మాకులపేట గ్రామపంచాయతీ పరిధిలోని కోయపోచ గూడెంలో ఆదివాసి గిరిజన పేదలు 2002 నుండి సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రలు ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఈ గ్రామాన్ని కూడా పోడు లిస్టులో చేర్చలేదన్నారు. దీంతో ఆదివాసి గిరిజన పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గిరిజన పేదలు సాగు చేసుకున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని, రోడ్లు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాజలింగు, ఎల్లయ్య, రమేష్, మహేశ్వరి, తార, సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శులు, బాపు, పోసవ్వ, పోషం, కోయపోచంగూడెం ఆదివాసి గిరిజన పేదలు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుచ్చంపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు. పేదవర్గాల అభ్యున్నతి కోసం ఆయన అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంల పార్టీ నాయకులు శంభు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి 'పొంగులేటి' పర్యటనను విజయవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఓఆర్ఓ చట్టం - 2025లో భాగంగా జిల్లాకు వస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమం సంబంధించిన ఏర్పాట్లను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ సదానందం, ప్రత్యేక తహసీల్దార్ వనజ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ ప్లాంట్‌లోని హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అదికారులు పాల్గొన్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మంగళవారం భీమారంకు రానుండగా సోమవారం ఏర్పాట్లను డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. సభ కోసం భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణాన్ని సీఐ వేణుచందర్‌తో కలిసి పరిశీలించారు.



## నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలు
# వినియోగాన్ని అరికట్టాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి
- నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి
- వివిధ శాఖల అధికారులతో సమక్షా సమావేశం

**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో నకిలీ, నిషేధిత విత్తనాల రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పనలతో కలిసి మండల తహశిల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పోలీసు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో బి.టి. పత్తి విత్తనాలతో పాటు బోల్ గార్డ్-1, 2 రకాలను చట్టబద్ధంగా ఉపయోగించడం జరుగుతుందని, బోల్ గార్డ్-3 రకాన్ని నిషేధించడం జరిగిందని, వీటిని ఉపయోగించడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. ఈ విత్తనంలో మానవులకు ఆరోగ్య సమస్యలు (క్యాన్సర్) ఉత్పన్నం కావడంతే కాకుండా ప్రకృతి కాలుష్యం జరుగుతుందని, వృక్షజాలంపై ప్రభావం పడి భూసారం క్షీణించి దుష్ప్రభావాలు కలుగుతాయని తెలిపారు. విత్తనచట్టం / పర్యావరణ చట్టం 1955 సెక్షన్ 3 ప్రకారం ఈ రకమైన విత్తనాలను నిషేధించడం జరిగిందని, రైతులు నకిలీ, పర్యావరణానికి, మానవాళికి హాని కలిగించే విత్తనాలు, ఎరువులను వినియోగించకుండా మండల స్థాయి వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో సాగుకు అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి షాపులో స్టాక్ నిల్వలు, ధరలతో కూడిన పట్టిక ప్రదర్శించాలని తెలిపారు. అదే విధంగా నకిలీ విత్తనాల విక్రయాలు నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విక్రయదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు షాపులకు సరఫరా చేసే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువుల పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు. విత్తనాలు, క్రిమి సంహారక మందులు విక్రయించినప్పుడు కొనుగోలు చేసిన వారి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కొనుగోలు చేసిన వారికి రశీదు జారీ చేయాలని, షాపులలో ఉన్న నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు ప్రదర్శించాలని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాలు, పిడిఎస్. రైస్, నిషేధిత క్రిమిసంహారక మందులు తరలించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహన యజమాని, డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని, రైతులకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీపీ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయం, వినియోగాన్ని నియంత్రించేందుకు టాస్కోఫోర్స్ బృందాలు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, నకిలీ, నిషేధిత విత్తనాల నిల్వ, పంపిణీ కేంద్రాలను గుర్తించి స్వాధీన పర్చుకోవాలని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. విత్తనాల రవాణా, ఉత్పత్తిని నియంత్రించడంలో పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతరాష్ట్ర, అంతర్ జిల్లా చెకోపోస్టుల వద్ద స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ అనుసరించాలని తెలిపారు. రైతులను మభ్య పెట్టకుండా చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తన విక్రయదారుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విత్తన రవాణా ప్రక్రియను తెలుసుకోవాలన్నారు.





## సింగరేణి కార్మికులకు లాభాల వాటాగా
# 40 శాతం చెల్లించాలి

**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కార్మికులకు ప్రకటించిన 40 శాతం లాభాల వాటను ఎలాంటి జపం చేయకుండా చెల్లించాలని బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి కోరారు. సోమవారం సింగరేణి డైరెక్టర్ అండ్ ప్లానింగ్ ప్రాజెక్టు డైరెక్టర్(పా) కొప్పుల వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సింగరేణి పరిశ్రమ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి వాస్తవ లాభాలపై వాటా 40% జాప్యం లేకుండా చెల్లించాలని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ పరంగా 2024-2025 ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఇప్పటి వరకు ప్రకటించని వాస్తవ లాభాలు, జాప్యం లేకుండా వెంటనే ప్రకటించి 40% వాటాను పంపిణీ చేయటానికి ఆదేశాలు జారీ చేయాలని సంస్థ డైరెక్టర్ (పా) రామగుండం పర్యటనలో కలిసి చర్చించినట్లు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70.12 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తే 37 వేల కోట్ల బిజినెస్ జరిగిందని, వాస్తవ లాభాలు లాభాలు రూ.4701 కోట్లు ప్రకటించి, సిఎస్ఆర్ నిధులు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ మళ్లింపులు మినహాయింపులు రూ.2289 కోట్లు, పోను, రూ.2412 కోట్లలో దానిలో 33% అంటే రూ. 795.96కోట్లను గత సంవత్సరం చెల్లించడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం కార్మికులు కష్టపడి రికార్డ్ స్థాయిలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి గాను 69.01మిలియన్ టన్నులు సాధించారని, వేల కోట్ల వ్యాపారం జరిగిందని, గత సంవత్సరం పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించిన కార్మికుల కోసం ఈ సారి లాభాల వాటా 40% ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్ పిపి ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లను కలిసిన వారిలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్, నాయకులు రౌతు రమేష్, దొనీకిన రమేష్, తిరునహరి కిరణ్ కుమార్, సల్ల వేణు, పాక కృష్ణ, కందుల మహేష్, తదితరులు ఉన్నారు.

# భూభారతి అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలి



**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం-2025లో భాగంగా ఈ నెల 20న జిల్లాలోని పైలెట్ మండలం భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్నందున కార్యక్రమ ఏర్పాట్లను పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన ఉదయం 9.50 గంటలకు జిల్లాకు చేరుకొని 10 గంటలకు భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం -2025 అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పాల్గొంటారని తెలిపారు. బందోబస్తు, రూట్ ప్లానింగ్, భద్రత సంబంధిత అంశాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, వాహనాల ఏర్పాటు, హెలిపాడ్ పర్యవేక్షణ, త్రాగునీరు, వేదిక ఏర్పాట్లు, ప్రోటోకాల్, అంబులెన్స్, వైద్య సేవలు, మెడికల్ కిట్స్ ఏర్పాటు చేయాలని, సౌండ్ సిస్టం పర్యవేక్షణ, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసే దిశగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కుమ్రంభీం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

**కాగజ్‌నగర్, మే 19 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనుల పురోగతిని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు సచావుగా నిర్వహించాలని, మురుగు కాలువల



వ్యవస్థలో మెరుగుపరచడం ద్వారా మున్సిపల్ పరిధిలో మురుగు నీటి సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. మున్సిపాలిటీలోని వార్డులలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి వార్డులోని ప్రతి ఇంటి నుండి నిత్యం తడి చెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు.

# విద్యుత్ స్తంభం ఏర్పాటు

**ఖానాపూర్, మే 19 (ప్రభాత సమాచారం)**
జనావాసాల మధ్య మూలమలుపులో ఉన్న పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్ స్థంభాన్ని ఏర్పాటు చేశారు. ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ అంతర్గత వీధి ప్రధాన రహదారిలో ఉన్న ఈ స్తంభం శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. స్థానికుల ఫిర్యాదుల మేరకు గుర్తించి తొలగించారు. పురపాలక శాఖ వారు వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేస్తారని చెప్పారు.





# మందమర్రిలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- భారీ శబ్ధంతో ఒక్కసారిగా ఎగిసి పడిన మంటలు..
- ఎగిసిన మంటలతో కాలిపోయిన ప్రధాన విద్యుత్ తీగలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీసిన స్థానికులు

**మందమర్రి, మే 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా మందమర్రిలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోయి, భారీగా మంటలు ఎగసిపడటం తీవ్ర కలకలం రేపింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగసిన మంటలతో ప్రధాన విద్యుత్ తీగలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ వెంటనే కరెంట్ సరఫరా నిలిపివేసింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలి అనంతరం ఉవ్వెత్తున మంటలు రేగడంతో స్థానికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. ప్రమాదానికి గల కారణాలు తెలయాల్సి ఉంది.

# అక్రమ నిర్మాణ పనులు నిలిపివేత

## అధికారుల తీరుపై బాధితుల నిరసన



**నెన్నెల, మే 19 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట సర్వే నంబరు 876లో చేపట్టిన ఇంటి నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులు పనులను అడ్డుకోగా, తమపై అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఇంటి యజమాని, అతడి కుటుంబీకులు సోమవారం ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డు పక్కన కీసరి సాయికుమార్ అనేవ్యక్తి కంటేనర్ హౌజ్ నిర్మాణం చేపట్టగా ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని ఫిర్యా దులు అందడంతో రెండు రోజుల కిందట బెల్లంపల్లి ఆర్డీవో ఇంటిని సీజ్ చేశారు. సాయికుమార్‌పై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయినప్పటికి పనులు కొనసాగుతున్నాయని తెలుసుకున్న అధికారులు సోమవారం మరోసారి వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ సులోచన, ఎస్సై ప్రసాద్ సిబ్బందితో చేరుకొని పను లను నిలిపివేశారు. ఇంటి నుంచి బయటకు వస్తే సీజ్ చేస్తామని చెప్పారు. సాయికుమార్‌తో పాటు అతడి తల్లి, భార్య పిల్లలు లోపలి నుంచి బయటకు వచ్చేందుకు నిరాకరించారు. మహిళా పోలీసులు తల్లి సుశీలను బయటకు తీసుకురాగా ఆమె ఏడుస్తూ స్పృహ కోల్పోయింది. ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లికి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిని సీజ్ చేయాల్సిం దేనని చెప్పి మిగతా వారిని కూడా బయటకు పంపి తాళాలు వేశారు. తన భార్య ఒంటిపై బంగారం అమ్మి కొనుక్కున్న స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రాజకీయ నాయకుల ఒత్తిడితో పనులను అడ్డుకుంటు న్నారని కీసరి సాయికుమార్ వాపోయారు. తమను మాత్రమే టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

# అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలి

- డీజీపీ (పర్సనల్) అనిల్ కుమార్
- జిల్లా పోలీసు కార్యాలయం పరిశీలన





**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని డీజీపీ (పర్సనల్) అనిల్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అంతకుముందు పోలీ సుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో జరిగే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని అధి కారులను ఆదేశించారు. హెచ్ఎర్ఎంఎస్ అప్లికేషన్ సిబ్బంది ప్రతి ఒక్కరూ వినియోగించేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు, అమలు చేస్తున్న విధానాలు, సమ్మర్ క్యాంపులు, చిల్డ్రన్ పార్కులు, సైబర్ క్రైమ్ తదితర విషయాలను డీజీపీకి ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్ట డానికి ప్రత్యేకంగా హైవేలపై ర్యాంబుస్టిప్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేజ్ పోలీసు ఆఫీసర్ వ్యవస్థ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేరాలను అరికట్టేందుకు రాత్రి వేళల్లో గస్తీ, పెట్రోలింగ్, ఆపరేషన్ చబుత్రా, మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్, కార్డెన్సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, స్పెష ల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని

# తహసీల్దార్‌కు బోరిగాం వాసుల వినతి



**ముథోల్, మే 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బోరిగాం గ్రామంలో తొలగించిన స్థలంలోనే బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు దళిత సంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల12న బోరిగాంలో గల ప్రభుత్వ భూమిలో గ్రామంలోని దళితులు బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేసి బుద్ధ జయంతి సందర్భంగా పూజలు చేయడంతో గ్రామంలోని కొందరు దళితులపై రాళ్లతో దాడి చేసి గాయపర్చారని వారు పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని రెవెన్యూ అధికారులు తొలగించి మనోభావాలను దెబ్బతీశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి దాడి చేసి గాయపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడి నుండైతే బుద్ధ విగ్రహాన్ని తొలగించారో అదే స్థలంలో అధికారులు బుద్ధ విగ్రహాన్ని పున ప్రతిష్ఠించాలన్నారు. లేకుంటే 26వ తేదీ నుండి నిరాహార దీక్ష చేపడుతామన్నారు. ఈకార్యక్రమంలో భారతీయ బౌద్ధమ సభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గడపాలే ప్రభాకర్, బుద్ధ కమిటీ అధ్యక్షులు దేవదాస్ హాజ్ డే, రాజారాం, ప్రకాశ్, రాందాస్, సాయన్న, రాందాస్, నారాయణ, గంగాధర్, దిగంబర్, రాహుల్, బింబిసర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన

**కుభీర్, మే 19 (ప్రభాత సమాచారం)**

శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. కుభీర్‌లో నేటి నుండి ఈనెల 25 వరకు జరిగే ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రైమరీ స్కూల్స్‌కు చెందిన ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్ అవసరాలు, అభ్యాసన ఫలితాలు, విద్య ప్రమాణాలు, బోధించే పద్ధతుల గురించి అదే విధంగా ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్ సైన్స్ సబ్జెక్టులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



# చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలి

- చెరువును కబ్జా చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదంటూ మత్స్యకారులు, చెరువు పరిరక్షణ సమితి సభ్యుల ఆందోళన

**లక్షెట్టిపేట, మే 19 (ప్రభాత సమాచారం)**

మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల పెద్ద చెరువుకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల హద్దులను గుర్తించాలని సోమవారం స్థానిక ఐబీలో మత్స్యకారులు, చెరువు పరిరక్షణ సమితి కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యసహకార సంఘం నాయకులు పోశయ్య, రాజేష్, నారాయణ చెరువు పరిరక్షణ సమితి కన్వీనర్ రవితో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. గత పదేళ్లుగా ఇటిక్యాల చెరువు అన్యాక్రాంతం అవుతుందని సంబంధిత శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కోరితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మత్స్యకారులు, రైతుల వైపు నిలవడం లేదని గతంలో ఏ కలెక్టర్‌కు దగ్గరికి వెళ్లి సమస్యను ప్రస్తావిస్తే వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నం చేసే వారని కానీ ఈ కలెక్టర్ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. స్వయంగా కలెక్టర్ మమ్మల్నే మీరు మత్స్యకారులా? రైతులా? అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారని, ప్రెస్ వాళ్ళను ఫోటోలు, వీడియోలు తీయవద్దు, మీరు జర్నలిస్ట్ లేనా అంటూ ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చే క్రమంలో ఎమ్మెల్యే కంటే ముందే కలెక్టర్ సర్ది చెప్పడం, మట్టిని తడి ఆరిపోయాక తరలిస్తారు అంటూ పక్కదోవ పట్టించారన్నారు. ఇన్నిరోజులు మట్టి కుప్పలు చెరువులో ఉంచి మేం ఇప్పుడు ప్రెస్ మీట్ పెడితే తొలగించేలా చర్యలు తీసుకోవడం ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కాదా? అని మండిపడ్డారు. స్వయంగా కలెక్టర్ మట్టిని తడిఆరిపోయాక తరలిస్తారు అని చెప్పారు కానీ నేటికీ తరలింపు ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. ఇప్పటికి మట్టి తరలింపు విషయంలో కలెక్టర్ ఆదేశాలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుకల తయారీకి అన్ని అనుమతులు తీసుకుని మట్టిని అక్కడే ఉంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ భూముల్లో చదును చేసుకోవడానికేనా మట్టి తవ్వకాలు అంటూ ప్రశ్నించారు. వర్షాకాలంలో ఉండే ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ జోన్‌ల హద్దులు గుర్తిస్తే తమకు న్యాయం జరుగుతుందని లేకపోతే రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చెరువును తవ్వి మట్టిని అక్కడే పోస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా గంపలపల్లి చెరువు నుంచి గొలుసుకట్టు విధానం ద్వారా నీరు వచ్చే కాలువను మట్టితో నింపుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనుమతులకు మించి ఎక్కువ లోతులో మట్టి తవ్వకాలు చేపట్టినట్టు, మట్టిని తరలించినట్లు మత్స్యకారులు ఆరోపించారు. గతంలో రాత్రి మాత్రమే తవ్వకాలు జరిపేవారని ఇప్పుడు పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మత్స్యకారులకు, రైతులకు చెరువు పరిరక్షణ విషయంలో న్యాయం జరుగకపోతే హైడ్రాతో పాటు, ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.



**కలెక్టర్, ఎమ్మెల్యేలు స్పందించాలి...**

జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావులు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దుల విషయంలో స్పందించి పారదర్శకంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు, రైతులు విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏండ్ల నుంచి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎమ్మెల్యే న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో మత్స్య సహకార సంఘం నాయకులు రాజేష్, పోశయ్య, భీమయ్య,నారాయణ అంజన్న, చెరువు పరిరక్షణ సమితి కన్వీనర్ రవి, మత్స్యకారులు గంగారాం, సత్తయ్య, నర్సయ్య, శ్రీకాంత్, వెంకటేష్, సత్యనారాయణ, నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.



## సమస్యలు సత్వరం పరిష్కరించాలి

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గ్రీవెన్స్‌లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 23 మంది ఎస్పీకి వినతులు అందజేశారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఆయా స్టేషన్‌ల అధికారులకు ఎస్పీ ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ వారం ప్రధానంగా కబ్జాలు, కుటుంబ కలహాలు, అధిక వడ్డీ, కోర్టు కేసులు, గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలు తదితర వాటిని ప్రజలు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల సమస్యలను ఓపిగ్గా విని వారికి భరోసా కల్పించేలా వ్యవహరించారు. సీసీ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



**నార్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. వర్షాలకు తడిసిన తేమ శాతం పెరిగిందని నిర్వాహకులీ ధాన్యం కొనుగోలు చేయడంలేదన్నారు. అధికారులు స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాష్, జాదవ్ రాహుల్, శ్రీకాంత్, జంగు మరియు కార్యకర్తలు ఉన్నారు.

## దైవ చింతనతో క్రమశిక్షణ



**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమాన్ దీక్షదారులకు సోమవారం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన దీక్షదారులకు మహా ప్రసాదాన్ని అందించారు. వారికి ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. చెడు అలవాట్లను వీడి సన్మార్గంలో నడవడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందని ఎమ్మెల్యే అన్నారు.

## ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు యూనివర్సిటీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఏలాంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నడుస్తున్నాయి అని పరీక్ష కేంద్రం ముఖ్య అధికారి కళ్లెం నరేందర్ తెలిపారు. అదనపు అధికారి వినాయక్ రావు యూనివర్సిటీ అబ్జర్వర్ కార్తీక్ ఉన్నారు.

# షాపుల కేటాయింపులో అవకతవకలు

## ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు



**బెల్లంపల్లి, మే 19 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ షాపుల కేటాయింపులో అవకతవకలు జరిగాయని కొందరు వ్యాపారులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో షాపుల కేటాయింపుపై కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రాతో కేటాయించిన విషయం తెలిసిందే. కాగా అర్హులకు షాపులు దక్కలేదన్న ఆరోపణలు కొంతమంది వ్యాపారస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో ప్రజా ఫిర్యాదులో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అర్హులైన వ్యాపారస్తులకు షాపులు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. సంబంధం లేని వ్యక్తులకు షాపులు, సెట్టర్లు కేటాయించారని తెలిపారు. షాపుల కేటాయింపు వెనక పెద్ద ఎత్తున ముడుపులు అవినీతి వ్యవహారం ఉందని కలెక్టర్ దృష్టికి వ్యాపారులు తీసుకువెళ్లారు. షాపుల కేటాయింపులో అవకతవకను సహించేది లేదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వ్యాపార వ్యాపారస్తులకు హామీ ఇచ్చారు. వ్యాపారస్తుల ఫిర్యాదును పరిగణంలోకి తీసుకొని విచారణ చేస్తానని హామీ ఇచ్చినట్టు ఫిర్యాదుదారులు తెలిపారు.

## దళితరత్న అవార్డు అందుకున్న మహేందర్



**నార్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**

సమాజ సేవలో గత పదిహేనేళ్లుగా కొనసాగుతున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్ సేవలను గుర్తించి మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం దళితరత్న అవార్డుతో సత్కరించింది. కాంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ రాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దళితరత్న అవార్డు సమాజం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వానికి మరియు సమాజ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి సతీష్, హక్కుల దండోరా వ్యవస్థాపకులు కనక రాజు, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

పదోన్నతి పొందిన ఏఎస్ఐలు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మీర్ ఉస్మాన్ అలీ, కౌటల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాబాజీ ఏఎస్ఐగా పదోన్నతి పొందగా ఎస్పీ డివి శ్రీనివాస రావు సోమవారం జిల్లా కేంద్రంలోని డిపీఓ కార్యాలయంలో ఇద్దరినీ సన్మానించి స్టార్ ను తొడిగారు పదోన్నతి తో పాటు బాధ్యత పెరుగుతోందని భవిష్యతులో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐఎం.టి.ఓ అంజన్న తదితరులున్నారు.





## అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

### కుమ్రంభీం జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావ్

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, ఇతరులను కించపర్చేలా పోస్టులు చేస్తే గ్రూప్ అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్సై, సీఐలతో ఫోన్లో మాట్లాడి పరిష్కారానికి సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో అనవ సర విషయాలను, రాజకీయ నాయకుల, కులమతాల మధ్య చిచ్చుపెట్టే అంశాలను, ఇతరుల మనోభావాలను కించపర్చేలా పోస్టులు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జ్యోస్న



**తాండూర్, మే 19 (ప్రభాత సమాచారం)**

తాండూర్ నూతన తహసీల్దార్‌గా జ్యోస్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది పూల మొక్క అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో భూతగాదాల సమస్యల పరిష్కారానికి మండల ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## బెల్లంపల్లి తహసీల్దార్‌గా కృష్ణ

**బెల్లంపల్లి, మే 19 (ప్రభాత సమాచారం)**



బెల్లంపల్లి నూతన తహసీల్దార్‌గా కృష్ణ నియమితులయ్యారు. తహసీల్దార్ కృష్ణ బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణ బెల్లంపల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

## ప్రభుత్వ పథకాల పేరుతో.. కబ్జాదారులకు ప్రభుత్వ భూములు



**బెల్లంపల్లి, మే 19 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లిలో ప్రభుత్వ పథకాల పేరుతో కబ్జాదారులకు భూములు అప్పగిస్తున్నట్లు బెల్లంపల్లి మున్సిపల్ అధికారుల తీరుపై ఎమ్మార్పీఎస్ నేతలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేష్ మాదిగ, ఇతర ప్రతినిధులతో కలిసి భూకబ్జా వ్యవహారంపై ప్రజా ఫిర్యాదులో లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్ కలిసి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో, కొత్త మున్సిపాలిటీ కార్యాలయం ప్రక్కన రహదారి ఆవరణలో కొందరు కబ్జాదారులు రాత్రికి రాత్రే ఒక కమర్షియల్ షట్టర్ నిర్మించారనీ తెలిపారు. ఈ నిర్మాణంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్" ను నిర్వహిస్తు, ప్రభుత్వమే ఆ నిర్మాణాన్ని చేపట్టిందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తు బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు పబ్బం గడుపుతున్నారన్నారు. ఈ అక్రమ నిర్మాణానికి, బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు కొంతమంది వ్యక్తుల నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని అనుమతులు ఇస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాదు, మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రహరీ గోడలు బద్దలు కొట్టి, వాటర్ పైప్ లైన్ వేసిన చర్యలు లేకపోవడం బాధాకమనీ వాపోయారు. ప్రభుత్వ భవన ప్రహరీ గోడను ధ్వంసం చేయడానికి అధికారికంగా అనుమతి ఎవరు ఇచ్చారు? మున్సిపల్ కమిషనర్‌కు అటువంటి అధికారం ఎవరు ఇచ్చారు? అని ఆ ఫిర్యాదు పత్రంలో అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక బలోపేతం కోసం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అక్రమ నిర్మాణాల్లో మహిళలతో కిరాయిలు వసూలు చేయడం దారుణమని వివరించారు. ఈ క్రమంలోనే, ఈ అక్రమ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అన్న దానిపై ఆర్టీఐ ద్వారా రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ, బెల్లంపల్లి ఆర్డీవో, బెల్లంపల్లి ఎమ్మార్వోను అడగగా, తాము వాటికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, తమ వద్ద ఆధారాలు లేవని లిఖితపూర్వకంగా తెలియజేశారని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ వెంటనే ఈ విషయాన్ని పరిగణలోకి అక్రమ నిర్మాణాన్ని తొలగించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# 'ఎంపీ, ఎమ్మెల్యేలు తీరు మార్చుకోవాలి'



**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మంచిర్యాల నియోజకవర్గంలో అశాంతి నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం వారు మా ట్లాడారు. కుల, మతాలు, వర్ణ విభేదాలకు అతీతంగా సోదరభావంతో జీవిస్తున్న వారి లో అశాంతి వాతావరణం నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారని, కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం సందర్భంగా ప్రోటోకాల్ పాటించలేదని వంశీకృష్ణ ఈ నియోజ కవర్గంలో రెచ్చకొట్టే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయాలని వారు సూచించారని విమ ర్శించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజక వర్గములో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యమత్యంగా ఉన్నారని, అలాగే ప్రజలు సోదరభావంతో కలిసి కట్టుగా ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి వాతావరణంలో కులాల వారిగా రెచ్చకొట్టి అలజడు లు సృష్టించాలని చూడడం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. బెల్లం పల్లి, చెన్నూర్ నియోజక వర్గాల్లో ఆందోళన లు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నా రు. కేవలం స్వార్థం కోసమే దళితులు, మా ల, మాదిగలు అంటూ విభజిస్తూ కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎస్సీ రిజర్వుడ్ స్థానం నుంచి కాకుండా జనరల్ స్థానం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో నేతకాని కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, జుమ్మిడి గోపాల్, ఎంఆర్పీఎస్ నాయకులు గోడిషాల దశరథం, బెక్కం రాజారామ్, ఐలయ్య, మల్లేష్, మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు పత్తి తిరుపతి, దళిత సంఘాల నేతలు, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజా మాజీ కౌన్సిలర్ రామగిరి బానేశ్, పుదరి తిరుపతి, సల్ల మహేష్, అశోక్ తేజ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రజిత, మహిళా పట్టణ అధ్యక్షురాలు గజ్జెల హేమలత పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న ముఠా సభ్యుల అరెస్ట్




**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణ కేంద్రంగా పట్టణంలోని వివిధ కాలనీలకు గ్రామీణ ప్రాంతాలకు గంజాయిని సరఫరా చేస్తున్న మూట సభ్యులను సోమవారం పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందని ఎస్పీ రాకేష్ మీనా తెలిపారు. సోమవారం వివరాలను వెల్లడించారు. పట్టణం చెందిన కేఈ సాయి ప్రసాద్ పుట్ట శివకుమార్ షేక్ ముక్తార్ మౌలానా ఉప్పుల శంకర్ అనే నలుగురు సభ్యులు మహారాష్ట్రలోని కిన్వర్ట్ తాలూకా నుండి గంజాయి తీసుకొస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు శనివారం రాత్రి బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహించగా మూట సభ్యుల వద్ద ఉన్న ఒక కేజీ 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు ఒక ఆటో ద్విచక్ర వానని సాధనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. నిర్మల్లో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని గంజాయిని విక్రయించిన కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎవరైనా గంజాయి సాగు చేసిన, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. గంజాయి నిర్మూలనతో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. అదే విధంగా యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ పోలీస్ సిబ్బంది వినయ్, అమీన్ సిబ్బంది తదితరులున్నారు.

# అర్హులకు రేషన్ కార్డ్ అందించాలి

## వాహనం ఉంటే రేషన్ కార్డ్ రద్దు అనే నిబంధన ఎత్తి వేయాలి

**బోథ్, మే 19 (ప్రభాత సమాచారం)**



అర్హత ఉన్నవారందరికీ రేషన్ కార్డ్ ఇవ్వాలని వాహనం ఉంటే రేషన్ కార్డ్ కు అనర్హులుగా ప్రకటిస్తున్నారని ఆ నిబంధన వెంటనే తీసివేయాలని మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ తరుపున బోథ్ డిప్యూటీ తహశీల్దార్ సూరజ్ కు సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ వినతి పత్రం అందజేశారు అనంతరం మాసం అనిల్కుమార్ మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబ వారు తమ బతుకు దెరువు కోసం ఫైనాన్స్ రూపం లో వాహనం కొనుగోలు చేసి అది నడుపుకుంటూ వచ్చిన డబ్బులుతో అటు ఫైనాన్స్ మరియు ఇటు కుటుంబం ను పోషిస్తున్నారు అని అలాంటి వారి పైన మీ పేరు మీద కారు, ఆటో మరియు వాహనాలు ఉన్నాయి అంటూ రేషన్ కార్డ్ రద్దు చేస్తున్నారు అని దాని ద్వారా పేద,మధ్య తరగతి కుటుంబాలు అవస్థలు పడుతున్నారు అని కనుక వారిని గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలి వెంటనే దీని పైన ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి అని తెలిపారు ఈ కార్యక్రమం లో బుడగ సంఘం సభ్యులు విఠల్,సంతోష్, రవి మరియు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ధర్మ సాగర్ బాధితులకు నిత్యవసర వస్తువుల పంపిణీ





**ఇంద్రవెల్లి, మే 19 (ప్రభాత సమాచారం)**

గాలి దుమారానికి శుక్రవారం రాత్రి ఇంద్రవెల్లి మండలంధర్మ సాగర్ గ్రామంలో ఎనిమిది గృహాలు కోల్పోయిన బాధితులకు ఆదివారం వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయాన్ని బాధితులు సాబ్లె జైత్రం, సాబ్లే లాలు, ధోతి సైనా బాయి, గోతి సర్దార్ లకు పంపిణి చేసారు. కార్యక్రమంలో వెడ్మ ఫౌండేషన్ ప్రతినిధి జె. కృష్ణ ఖైతీ లా బానాగురువగు రామసింగ్ మహారాజ్ తో పాటుగ్రామ పెద్దలు మాజీ ఉపసర్పంచ్ శ్యామ్ రావు, సాబ్లె సర్దార్, జ్ఞానేశ్వర్ కేంద్రీ, డాకురే శత్రుఘన్, జాదో రమేష్, మేడే వార్ అది నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఇండ్లు కోల్పోయిన వారికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి ప్రయత్నిస్తానన్నారు. అలాగే సాబ్లే జైత్రం వికలాంగుడుగా ఉండి ఇల్లు తినుబండారాలు కోల్పోయినందులకు, ఆయన దినచర్య ఆటోతో రోజువారి కూలీ సంపాదన కోల్పోయినందులకు ఫైనాన్స్ వారు ఆయన ఆటోను తీసుకువెళ్లడంతో వారికి సంప్రదించి ఆ ఆటోను ఇప్పిస్తానన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

### కుమ్రంభీం కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆసిఫాబాద్ పటణం సందీప్ నగర్కు చెందిన దుర్గం సంగీత తన కూతురుకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం ఎల్లారంకు చెందిన ఆరిందుల సుధాకర్ తాను కొనుగోలు చేసిన భూమికి పట్టా పాసుపుస్తకం ఇవ్వాలని, జైనూర్ మండలం సోను పటేల్ గూడకు చెందిన మిశ్రమ తూర్పుబాయ్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ మండలం రహపల్లికి చెందిన మారిశెట్టి గురువయ్య తన భూమికి కొలతలు చేయించాలని, జైనూర్ మండలం ఊసేగాంకు చెందిన మడావి శ్యాంసుందర్ తనకు గ్రామ పంచాయతీలో కామాటీగా ఉపాధి కల్పించాలని దరఖాస్తులు సమర్పించారు.

## సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

దక్షణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట రథసారధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దినకర్ అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి ని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కా ర్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దినకర్ మాట్లాడు తూ 1932లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి తన ఇంటి నుంచే పోరాటం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాస్, రాజేందర్, కార్తీక్, టీకానంద్, కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.




# అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలి

**రెబ్బెన, మే 19 (ప్రభాత సమాచారం)**



అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ సోమవారం అడిషనల్ కలెక్టర్ డేవిడ్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కుమురం భీం జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు అందించాలన్నారు. ప్రధానంగా బ్యాంకులు సిబిల్ స్కోర్తో సంబంధం లేకుండా అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. రుణాల మంజూరు విషయంలో గతంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొని ప్రస్తుతం బీసీ ఇన్చార్జి ఈడీగా వ్యవహరిస్తున్న అధికారిని వెంటనే ఆ బాధ్యతల నుంచి తొలగించి మరో అధికారికి అప్పగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు అన్యాయం జరిగితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇళ్లు మంజూరు చేశారని, దీంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరిగెల మధుకర్ గౌడ్, సోనాపూర్ గ్రామపటేల్ కుమురం దొందేరావు, తదితరులు పాల్గొన్నారు.



# భవనం భద్రమేనా..?

## ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా అనేకం

**వర్తక, వ్యాపార, వాణిజ్యాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేరాఫ్‌గా నిలుస్తుండటం.. రోజురోజుకూ నగర, పట్టణ ప్రాంతాలు విస్తరిస్తుండటం.. అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలు చకచకా జరిగిపోతుండటం అభివృద్ధికి మెట్టుగా భావిస్తున్నా.. లోప భూయిష్టంగా జరుగుతున్న అనేక నిర్మాణాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. రెండు రోజుల క్రితం చార్మినార్ గుల్జార్ హౌస్ వద్ద ఘోర అగ్ని ప్రమాదం నేపథ్యంలో మన జిల్లాల్లో ఉన్న భవనాల భద్రతపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన బహుళ అంతస్తుల్లో వివిధ వ్యాపారాలు, ఆస్పత్రులు, అపార్ట్ మెంట్లు, హాస్టళ్లు, ఫంక్షన్ హాళ్లు, విద్యా సంస్థలు కొనసాగుతుంటే.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.**

- అగ్ని ప్రమాదం జరిగితే అంతేనా..
- షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్ హాళ్లు
- ఆస్పత్రులు, పాఠశాలల్లో కనిపించని ఫైర్‌సేఫ్టీ
- అపార్ట్‌మెంట్‌లలోనూ కానరాని నిబంధనలు..
- విద్యా సంస్థల్లో పరిస్థితి మరీ దారుణం.. గొర్ల చావిడిలా హాస్టల్ గదులు
- ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలుండే అవకాశం
- ఏదైనా ఘటన జరిగితే అధికారుల హడావిడి
- 'మామూలు'గా తీసుకుంటున్న అగ్నిమాపక శాఖ
- చార్మినార్ ఘటన నేపథ్యంలో చర్చనీయాంశంగా మారిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భవనాల అంశం

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

చార్మినార్ గుల్జార్ హౌస్‌లో ఘోర అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించిన నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భవనాల భద్రతపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దపెద్ద భవంతులు నిర్మించి అనేక రకాలైన వ్యాపారాలు చేస్తున్న యజమానులు ప్రభుత్వ నిబంధనల మేర నిర్మాణాలు చేపట్టడం లేదన్నది నిజం. అయితే నిర్మాణ సమయంలోనే వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక భవనాలు పూర్తి విరుద్ధంగా ఉండటం విస్మయం కలిగిస్తోంది. తాజాగా హైదరాబాద్ ఘటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ విషయమై తీవ్ర చర్చ సాగుతోంది. అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేదని, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అనేక భవనాల పరిస్థితి ఇదే విధంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### వ్యాపారానికి సై.. నిబంధనలకు నై..

బహుళ అంతస్తులు నిర్మిస్తున్న యజమానులు అనేక మంది ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తమకు ఇష్టం వచ్చినట్లు నిర్మించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదిలాబాద్ పట్టణంతో పాటు మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో వందలాది ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లు, హాస్టల్ భవనాలు ఇదే విధంగా నిర్మించడం ఆందోళనకరమైన విషయం. భవనాలు నిర్మిస్తున్న యజమానులు రాజకీయ పలుకుబడి కలిగి ఉండటంతో కొన్నింటిలో చూసీ చూడనట్లు వదిలేస్తున్నామని మున్సిపల్, కార్పొరేషన్ అధికారులే బాహాటంగా చెబుతున్నా.. కొన్నింటిపై మాత్రం తూతూమంత్రంగా చర్యలు తీసుకుని వదిలేస్తున్నారు. ఫలితంగా భవనాల భద్రతపై నీలినీడలు అలముకుని ప్రజల ప్రాణాలమీదికి వస్తుండటం గమనార్హం. వ్యాపారాలు చేయడానికి, కిరాయిలకు ఇచ్చుకోవడానికి చూపుతున్న ఆసక్తి నిబంధనల మేరకు నిర్మించుకుందామనే ఆలోచన ఉండటం లేదని ఓ సీనియర్ సిటిజన్ ఆవేదన వ్యక్తం చేశాడు.



ఇక ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉందని ఫైర్‌సెఫ్టీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ అక్కడా నిబంధనలకు వ్యతిరేకంగా బహుళ అంతస్థులు అనేక ఉండటం అధికారులు పట్టింపులేని తనానికి నిదర్శనంగా మారాయి. ఇటీవల ఉమ్మడిలో జిల్లాలో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి... వీటిలో జిన్నింగ్ మిల్లులో అధిక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.. ఈ ఘటనలో లక్షలాది రూపాయల ఆస్తినష్టం కూడా సంభవించింది.. ఆదిలాబాద్ జిల్లాలో మూడు ఫైర్ స్టేషన్‌లు ఉన్నాయి.. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్‌లో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో 2 ఫైరింజన్లు ఉండగా, ఒకటి మార్కెట్ యార్డుకు సంబంధించినది. ఈ స్టేషన్ ద్వారా ఆదిలాబాద్, జైనథ్, బేలతో పాటు తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల పరిధిలో ప్రమాదాలు జరిగితే ఇక్కడి నుంచే ఫైరింజన్లు వెళ్తాయి. ఉట్నూర్, ఇచ్చోడ పరిధిలోని మండలాల్లో దాదాపు 50 కిలోమీటర్లకు పైగా దూరంలో ప్రమాదం జరిగినప్పుడు ఫైరింజన్లు వెళ్లేసరికి ఆస్తులు కాలి బూడిదవుతాయి. బోథ్, బేలలో ఫైర్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా డిమాండ్ ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. గతంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనల్లో ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్నాయి.. ఓ అపార్ట్‌మెంట్ అగ్నికి ఆహుతి కాగా.. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

### అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు.. హాస్టళ్లు.. ఫంక్షన్‌హాళ్లు..

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఆస్పత్రులు, ప్రైవేటు విద్యా సంస్థలు, హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, ప్రధానంగా ఫంక్షన్‌హాళ్లు అయితే మరీ దారుణం. ప్రమాణాలు, నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా నిర్వహిస్తున్న తీరు విస్మయం గొలుపుతోంది. వంద, రెండు వందల గజాల్లోనే ఎటువంటి సౌకర్యాలు లేకుండా బహుళ అంతస్తులు నిర్మించడం వ్యాపార కేంద్రాలుగా మార్చడంలో యజమానులు ఆరితేరారు. ఆదిలాబాద్ పట్టణంలోని అనేక పంక్షన్‌హాళ్లు, ఆసుపత్రులు, సరైన సౌకర్యాలు లేకుండానే నిర్వహిస్తుండం.. అటు వైపు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఇటు మున్సిపల్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇక హాస్టళ్ల పరిస్థితి అత్యంత అధ్వానం. సింగిల్ ఎంట్రెన్స్‌తో ఉండే హాస్టళ్లలో ఒక్కో గదిలో పదుల సంఖ్యలో విద్యార్థులను కుక్కడం, బ్రాండ్ పేరిట తల్లిదండ్రులు వాటినే ప్రిఫర్ చేయడం ఆందోళన కరంగా మారింది. వీటిపై కూడా విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటంగా మారింది. వీటికి తోడు లిఫ్ట్‌ల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో పలుమార్లు లిఫ్ట్‌లు మొరాయించడం అందులో చిక్కుకుని బతుకు జీవుడా అంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డ సంఘటనలూ ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 200 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, అందులో కేవలం 40 మాత్రమే



ఫైర్‌సేఫ్టీ పరికరాలు కలిగి ఉన్నాయి. ఇక 50 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా, కేవలం ఐదారుకు మించి వాటిలో ఈ పరికరాలు కనిపించని పరిస్థితి. నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు 2009 సంవత్సరం తర్వాత అన్నింటికి ఫైర్‌సేఫ్టీ అనుమతి తప్పనిసరి. అలాగే అపార్ట్‌మెంట్లకు 18 మీటర్లు, ఆస్పత్రులు 15 మీటర్ల ఎత్తులో ఉన్నవాటికి అనుమతులు పొందాలి. చాలా అపార్ట్‌మెంట్లలో ఈ పరికరాలు అందుబాటులో లేవు. మంచిర్యాల జిల్లాలో 150కి పైగా ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. ఐదింటికే ఫైర్‌సేఫ్టీ అనుమతులు ఉన్నాయి. జూనియర్, డిగ్రీ కళాశాలలు 35 ఉండగా.. నాలుగు కళాశాలలకు, 155 పాఠశాలల్లో 20 స్కూళ్లకు అనుమతులు ఉన్నాయి. పేరున్న షాపింగ్ మాల్స్ 27 ఉండగా ఒక్క దానికీ అనుమతి లేదు. ఆరు సినిమా థియేటర్లకు అనుమతి ఉండగా.. మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నోటీసులు జారీ చేసినా రెన్యూవల్ చేసుకోవడం లేదని ఫైర్ అధికారులు చెబుతున్నారు. 27లాడ్జీలు, 20 ఫంక్షన్ హాళ్లలో ఒక్కదానికీ అనుమతి లేకపోవడం గమనార్హం.

### కొరడా ఝులిపిస్తారా..? 'మామూలు'గానే తీసుకుంటారా..?

నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణం అయిన బహుళ అంతస్తుల భవనాల విషయంలో ఉమ్మడి జిల్లా అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా? లేదా రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి తీసుకువస్తారా? అన్నది చూడాలి. వివిధ శాఖల అధికారులు చర్యలకు పూనుకుంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది బహుళ అంతస్తుల భవనాలతో పాటు ఆస్పత్రులు, ఫంక్షన్ హాళ్లు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేటతెల్లమవుతుంది. వీటన్నింటిపై చర్యలు తీసుకుని సౌకర్యాలు ఏర్పాటు చేయించే బాధ్యత అధికారులు తీసుకుంటే ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చినట్టు అవుతుంది. 'మామూళ్ల' మత్తులో జోగుతూ తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకుంటే జరగరాని ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.






# కరివేపాకు తింటే ఎంతో ఆరోగ్యం

» జుట్టు రాలడానికి ఇది అద్భుత నివారణ

హెల్త్ డెస్క్

కరివేపాకు, సుగంధభరితమైన ఆకుకూర, భారతీయ వంటకాలలో ఒక ముఖ్యమైన పదార్థం. ఇది ఆహారానికి రుచిని ఇవ్వడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. కరివేపాకులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. కరివేపాకు నీటిని ఖాళీ కడుపుతో తాగడం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి..

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది :**
ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కరివేపాకులో జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపించే గుణాలు ఉన్నాయి. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. మలబద్ధకం, వికారం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. కరివేపాకులో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది మలబద్ధకాన్ని నివారించడానికి , ప్రేగు కదలికలను మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

**శరీరాన్ని డీటాక్సిఫై చేస్తుంది :**
కరివేపాకు నీరు సహజమైన డీటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగించడానికి సహాయపడుతుంది , రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కరివేపాకులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, కణాలను నష్టం నుండి రక్షించడానికి సహాయపడతాయి. శరీరాన్ని డీటాక్సిఫై చేయడం వల్ల చర్మం ఆరోగ్యం మెరుగుపడుతుంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది :**
కరివేపాకు నీరు జుట్టు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, జుట్టు రాలడాన్ని తగ్గించడానికి, జుట్టును బలంగా , ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. కరివేపాకులో జుట్టు పెరుగుదలకు అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది జుట్టు కుదుళ్లను బలపరుస్తుంది, జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. కరివేపాకు నీరు తెల్ల జుట్టును నివారించడానికి కూడా సహాయపడుతుంది.



# హరి హర వీరమల్లు 3rd సింగిల్




పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ 'హరి హర వీర మల్లు' నుంచి అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 3rd సింగిల్ లిరికల్ వీడియో "అసుర హననం పాటను మే 21, ఉదయం 11:55 కు విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. రీసెంట్ గా 'హరి హర వీర మల్లు' సినిమా 2025 జూన్ 12న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ఈ 3rd సింగిల్ అప్ డేట్ తో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. క్రిష్ జాగర్లమూడి, ఏ.ఎం జ్యోతి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పవన్ సరసన నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించింది. ఈ సినిమాను 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం ఆధారంగా రూపొందించారు. గతం లో సోషల్ మీడియా వేదికగా నిర్మాత తన ఆనందాన్ని పంచుకుంటూ.. "చిత్రీకరణ పూర్తయింది. ఇక థియేటర్లలో కలుసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. అద్భుతమైన పాటలు, పవర్‌ఫుల్ ట్రైలర్‌నుత్వరలో విడుదల చేయనున్నాం," అని వెల్లడించారు. ఈ చిత్రం మొదటి నుంచి అనేక సార్లు వాయిదా పడుతూ వచ్చింది. గతంలో మే 9 విడుదల తేదీని ప్రకటించినప్పటికీ, షూటింగ్ పెండింగ్ ఉండటంతో విడుదలను మళ్ళీ రీషెడ్యూల్ చేశారు. అయితే, ఎట్టకేలకు జూన్ 12న విడుదల ఫిక్స్ చేసుకున్నాడు వీరమల్లు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. డబ్బింగ్, రీ-రికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ జోరుగా కొనసాగుతోంది. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



# లవ్ స్టోరీతో ఘట్టమనేని యంగ్ హీరో అరంగేట్రం..

ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో హీరో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. మూడవ జనరేషన్ హీరోగా సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని అరంగేట్రానికి రంగం సిద్దమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే జయ కృష్ణ యునైటెడ్ స్టేట్స్‌లోని యాక్టింగ్ కోర్సు కూడా పూర్తి చేశారట. అక్కడ నటనకు అవసరమైన నైపుణ్యాలను, మెళకువలను నేర్చుకున్నాడు. ఘట్టమనేని కుటుంబం త్వరలోనే జయకృష్ణ హీరోగా కొత్త కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి 'RX 1100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహించగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతి ఫిలిమ్స్ ప్రొడ్యూస్ చేస్తుందని సమాచారం. ఇటీవలే జయకృష్ణ సినిమాకు సంబంధించిన ఫొటో షూట్ లో కూడా పాల్గొన్నారని తెలుస్తోంది.



# ఇంట్రెస్టింగ్ సీక్వెల్ తో తాప్సీ

విభిన్న కథలను ఎంచుకుంటూ ఆడియన్స్ ను అలరిస్తూ వస్తున్న తాప్సీ పన్ను నుంచి 2018లో వచ్చిన ముల్క్ సినిమా ఎంత మంచి టాక్ ను తెచ్చుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కోర్టు రూమ్ డ్రామాగా వచ్చిన ఈ సినిమాలో తాప్సీ తో పాటూ రిషి కపూర్ కూడా నటించి ఆ సినిమాను మరింత రక్తి కట్టించి ఆడియన్స్ ను మరింత ఆకట్టుకున్నారు. ఓ ముస్లిం కుటుంబం ఎదుర్కొనే మతతత్వానికి సంబంధించిన కథగా ముల్క్ తెరకెక్కింది. ముస్లిం కుటుంబానికి చెందిన మురాద్ అలీ మొహమ్మద్ ఉగ్రవాదంలో చిక్కుకున్న తర్వాత కోల్పోయిన గౌరవాన్ని తిరిగి పొందడానికి చేసే ప్రయత్నంగా ముల్క్ రూపొందింది. ఈ సినిమాలో తాప్సీ, రిషి కపూర్ తో పాటూ రజత్ కపూర్, మనోజ్ పహ్వా, ప్రతీక్ బబ్బర్, అశుతోష్ రానా, నీనా గుప్తా, ప్రాచీ షా పాండ్యా కూడా నటించారు. ఇప్పుడు ముల్క్ సినిమాకు సీక్వెల్ గా ముల్క్2 రాబోతుంది. ముల్క్ సినిమాకు దర్శకత్వం వహించిన అనుభవ్ సిన్హా నే ఈ సీక్వెల్ కు కూడా దర్శకత్వం వహిస్తున్నాడు. ముల్క్ సినిమాలా నే ఈ సినిమా కూడా ఐడెంటిటీ, విశ్వాసం, పౌర హక్కులకు సంబంధించిన అంశాలను మరోసారి లోతుగా పరిశీలిస్తుందని చిత్ర యూనిట్ హామీ ఇస్తోంది. బోల్డ్ క్యారెక్టర్లను ఎంచుకుని తన పవర్‌ఫుల్ నటనతో ఎంతో ప్రఖ్యాతి చెందిన తాప్సీ, మరోసారి ముల్క్ 2లో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ చేసే అవకాశముందని తెలుస్తోంది. ముల్క్2 తో అనుభవ్ సిన్హా మరింత గొప్ప కంటెంట్ ను ఆడియన్స్ కు అందించి, మరో మంచి హిట్ ను ఖాతాలో వేసుకోవాలని టార్గెట్ గా పెట్టుకున్నాడు. ప్రస్తుతం తెరకెక్కుతున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమాల్లో ముల్క్2 కూడా ఒకటిగా నిలిచింది.

# కాంగ్రెస్ పార్టీ సమావేశం రసాభాస

- పరిశీలకుల ఎదుటే నేతల బాహాబాహీ
- మాజీ కౌన్సిలర్‌పై చేయి చేసుకున్న పీసీసీ సభ్యుడు
- ఇరువర్గాల మధ్య తోపులాట బయటపడ్డ గ్రూప్ తగాదాలు
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు



**చెన్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో నాయకులు బాహాబాహీకి దిగారు. ఇరువర్గాలు కొట్టుకునే వరకు వెళ్లారు. రాష్ట్ర పరిశీలకుల ఎదుటే మాజీ కౌన్సిలర్‌పై పీసీసీ సభ్యుడు చేయి చేసుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. పరిశీలకులు రాష్ట్ర ఆయిల్, ఫర్టిలైజర్స్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పీసీసీ కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే, పరిశీలకులు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు చాంబర్‌లోకి వెళ్లారు. అనంతరం సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బ్లాక్, మండల, పట్టణ, గ్రామ అధ్యక్షుల ఎన్నికల కోసం పరిశీలకులు చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీ కోసం పని చేసిన వారికి ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెన్నూర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పోగుల సతీష్ ఫిర్యాదు చేశారు. దీంతో పీసీసీ సభ్యుడు మందమర్రికి చెందిన పిన్నంటి రఘునాథ్ రెడ్డి ఆయనతో ఘర్షణకు దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరినొకరు తోసుకున్నారు. సహనం కోల్పోయిన రఘునాథ్ రెడ్డి సతీష్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో చెన్నూర్ నాయకులు ఆందోళనకు దిగారు. సీఐ దేవేందర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. సమావేశంలో మాజీ ఎమ్మె ల్సీ పురాణం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## వన్యప్రాణులను సంరక్షించాలి

### అటవీ శాఖ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వాణన్

**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని అటవీ శాఖ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వాణన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో వైల్డ్ లైఫ్ ఫండ్ ఎన్జీవో ఆధ్వర్యంలో 'వన్యప్రాణుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర' అనే అంశంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వాణన్ మాట్లాడుతూ.. వన్య ప్రాణులను సంరక్షిస్తే ప్రకృతిని, జీవ వైవిధ్యాన్ని కాపాడినవారమవుతామని తెలిపారు. జిల్లా ఆటవీశాఖ అధికారి నాగిని భాను, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధులు హర్షవర్ధన్, రాజు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ఎమ్మెల్యే అనిల్ పరామర్శ



**బోథ్, మే 19 (ప్రభాత సమాచారం)**

సిరికొండ మండలం సిరిచేల్మా గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. నేరడిగొండ (జి) గ్రామానికి చెందిన ప్రజలు వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా బులెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడి, సుమారు 20 మందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం పరామర్శించి. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## పుచ్చలపల్లి ఆశయ సాధనే ధ్యేయంగా ఉద్యమించాలి

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనే ధ్యేయంగా బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు పూసం సచిన్ పిలుపునిచ్చారు. సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచిన్ మాట్లాడుతూ.. స్వతంత్ర ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య పాల్గొన్నారన్నారు. కుల నిర్మూలన కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. సమ సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.




## సుందరయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలి



**జన్నారం, మే 19 (ప్రభాత సమాచారం)**

పుచ్చలపల్లి సుందరయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల నాయకులు కూకటికారి బుచ్చయ్య సిఐటియు మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మండలంలోని రామ్ నగర్ కాలనీలో అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య స్వతంత్రం కోసం పోరాటం చేసిన మహానేత అన్నారు. ఆయన గొప్ప స్వతంత్ర సమరయోధుడు అన్నారు. అలాగే తెలంగాణ సాయుధ పోరాటం చేసిన మహా నేత అన్నారు. యువకులు అతని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం రాష్ట్రం కోసం అతను చేసిన సేవలు ఎనలేని అన్నారు. కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య జీవితం పేదల కోసం సమ సమాజం కోసం త్యాగం చేశాడన్నారు. అతని ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కృషి చేయాలన్నారు. 17 ఏళ్ల వయసులోనే మహాత్మా గాంధీ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ గొర్ల లింగన్న రాజన్న, ఐద్వా మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ, గంగన్న మల్లన్న రాజేష్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి

**లక్షెట్టిపేట, మే 19 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని గోదావరి రోడ్డులో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు అకస్మిక దాడి చేశారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రమాకరం గోదావరి రోడ్డులో పేకాట స్థావరంపై దాడి చేయగా ఈ దాడిలో ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకొని వారివద్ద నుండి రూ.2720తో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్సై తెలిపారు. నిందితుల వివరాలిలా ఉన్నాయి. ఎంబడి వెంకటేష్, చిట్టుమల్ల రాకేష్, అబ్దుల్, జాఫర్, బుద్దే రాయమల్లు, సాజిద్, గౌస్, గోయికారి వినోద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సైతో పాటు పోలీసు బృందం పాల్గొన్నారు.

## బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ

**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి జిల్లా బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. మంచిర్యాలలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 12 బాలుర విభాగంలో ఆరవ్, నిహాల్, బాలి కల విభాగంలో సహస్ర గోల్డ్ మెడల్ సాధించారు. జ్యోత్స్న కాంస్య పతకం సాధించింది. అండర్-14 బాలుర విభాగంలో ధృవ బంగా రు, దినేష్ వెండి పతకాలు సాధించగా, అండర్-17 బాలికల విభాగంలో నిఖిత, శ్రావణి గోల్డ్, అక్షిత సిల్వ ర్, కీర్తన, అభినయ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరు ఈనెల 24 నుంచి 26 వరకు మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులను జిల్లా బాక్సింగ్ సెక్రటరీ చందుల స్వామి, డీఎస్వో శ్రీకాంత్రెడ్డి అభినందించారు.





## వీరబ్రహ్మేంద్రస్వామి శోభయాత్ర

**ముథోల్, మే 19 (ప్రభాత సమాచారం)**

ముథోల్‌లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి శోభయాత్రను గ్రామస్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతిఏటా ఆనవాయితీగా ఎడ్ల బండ్ల పై ప్రత్యేకంగా అలంకరించి వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రధాన వీధుల గుండా శోభయాత్రను చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు. ప్రతి సంవత్సరం వీరబ్రహ్మేంద్రస్వామి శోభయాత్రను ఆనవాయితీగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

## బీసీ సంక్షేమ సంఘ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా కిరణ్



**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక భవనంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిరణ్‌ను బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు రమేష్, సంఘ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా నియమించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

2025-26 విద్యాసంవత్సరానికిగాను ప్రైవేట్-కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 7-జీపీఏ కంటే ఎక్కువ వచ్చిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

# జొన్న పంట బకాయిలపై మంత్రి దృష్టికి తీసుకెళ్తా

## మాజీ ఎంపీ సోయం బాపురావు



**బోథ్, మే 19 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మాజీ ఎంపీ సోయం బాపూరావు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్నల డబ్బులు త్వరగా రైతుల కు వచ్చే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావ్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. మార్కెట్ యార్డులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొర్ల రాజు యాదవ్ రైతుల కొరకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు పాల్గొని రైతులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగో లు చేస్తామని అన్నారు. అంతేగాకుండా జొన్న పంటను అమ్మిన రైతులకు డబ్బులు ఇప్పటి వరకు రాలేదని తమ దృష్టికి వచ్చింది అన్నారు. ఈ విషయమై రెండు రోజుల్లో వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరి ష్కరించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# 280 క్వింటాళ్ల జొన్నల పట్టివేత

### ఏపీ నుంచి ఆదిలాబాద్ అక్రమంగా తరలింపు

### రెండు లారీలు సీజ్ చేసిన పోలీసులు

**సిరికొండ, మే 19 (ప్రభాత సమాచారం)**

ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాకు అక్రమంగా జొన్నలను తరలిస్తున్న రెండు లారీలను నేరడిగొండ, సిరికొండ మండలాల్లో పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 280 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. నేరడిగొండలో 250 క్వింటాళ్లను నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ట్రేడర్ ఆంధ్రప్రదేశ్ నుంచి లారీలో 250 క్వింటాళ్ల జొన్నలను తరలిస్తుండగా వాంకిడి గ్రామ సమీపంలో సోమవారం పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పంచ నామా అనంతరం వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ అధికా రులకు అప్పగించినట్లు తెలిపారు. అదే విధంగా సిరి కొండ మండలంలో 30 క్వింటాళ్ల జొన్నలను ఆంధ్ర ప్రదేశ్ నుంచి సిరికొండ మండలానికి అక్రమంగా లారీలో తరలిస్తుండగా స్థానిక పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై శ్రీసాయి తెలిపిన ప్రకారం వివ రాల ప్రకారం మండలంలోని రాంపూర్(బి) గ్రామానికి జొన్నల లోడుతో వచ్చిన లారీని ముందస్తు సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేశారు. ఏపీలోని గుంటూరు జిల్లా కావలి నుంచి 30 క్వింటాళ్ల జొన్నలను తీసు కొచ్చినట్లు గుర్తించారు. అయితే వీటిని ఎవరు తీసుకొ చ్చారు.. ఎందుకు తీసుకొచ్చారు వంటి సమాధానాలు సదరు డ్రైవర్ పేర్కొనకపోవడం గమనార్హం. రెవెన్యూ అధికారుల పంచనామా అనంతరం పట్టుబడిన లారీని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# మహిళల భద్రత కోసమే 'మై ఆటో సేఫ్'



**నార్నూర్, మే 19 (ప్రభాత సమాచారం)**

మహిళల భద్రత కోడ్‌ను ఆటోలకు ఇస్తున్నట్లు సీఐ రహీంపాషా అన్నారు. సోమవారం మం డల కేంద్రంలోని ఆటో యూనియన్ భవన్ వద్ద ఆటోలకు మై ఆటో సేఫ్ పేరుతో క్యూఆర్ కోడ్ పం పిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళలు ఆటోలో ప్రయాణి చేసేటప్పుడు ఏదైనా ప్రమాదం అనిపించినా, ఆకతాయిలు ఇబ్బంది పెట్టినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 100 నెంబర్‌కు డయల్ అవుతుందన్నారు. దీంతో మహిళలకు భద్రత కలుగుతుందన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, పోలీస్ సిబ్బంది రవీందర్ తదితరులు ఉన్నారు.




# ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని కోటి సంతకాల సేకరణ

**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వ ర్యంలో మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని సిసిసి కార్నర్ వద్ద సోమవారం కోటి సంతకాల సేకరణ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సంద–ర్భంగా వారు మా ట్లాడుతూ ఆర్థిక పరమైన రిజర్వేషన్లు చెల్లవని 1993లో ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిం దని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 103 ను సవరించి ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్ర కులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిం చడం అంటే ఇది బీసీలకు తీవ్ర అన్యాయమేనన్నారు. ఏ ఉద్యమం చేయకుండానే అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన బిజెపి ప్రభుత్వం గత 40 సం వత్సరా లుగా బీసీల జనాభా ప్రతికన రిజర్వే–షన్లు కల్పించాలని ఉద్య మాలు చేస్తున్న మా న్యాయమైన మా ప్రజాస్వా మ్య వాటా ఇవ్వకపోవడం అంటే ఇది పూర్తిగా బీసీలపై వివక్షగా భావిస్తున్నామని, మండల్ కమిషన్ సిఫార్సు ప్రకారం కనీసం 27 శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన ప్రజాస్వా మ్య వాటా 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాం డ్ చేశా రు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీని వాస్, నాయకులు గజేల్లి వెంకటయ్య శాఖపురి భీంసేన్, సీపతి రాములు, తోకల వెంకటేష్ పాల్గొన్నారు.

# యువకవుల సమ్మేళనం పోస్టర్ల విడుదల



**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే యువ కవుల సమ్మేళనం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సోమవారం ఆయన నివాసంలో విడుదల చేశారు. జాగృతి నాయకులు ఐద ప్రశాంత్ మాట్లాడుతూ జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యువ కెరటాలు శీర్షికతో కల్వకుంట్ల కవిత అధ్యక్షతన హైదరాబాద్ తెలంగాణ సరస్వతి పరిషత్లో ఉదయం 10 గంటల నుంచి తెలంగాణ అస్తిత్వం, తాత్వికత, జీవన విధానం చరిత్ర, భాష, సంస్కృతి, ఉద్యమం అనే అం శాలపై యువ కవులకు ఆహ్వానం పలుకుతు న్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు మే 26లోపు మెయిల్‌కు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు పడాల రవీందర్, పుల్లూరి మౌనిక, రాకేశ్, బిల్లా మారుతి, గడ్డం మహేశ్, తోట రంజిత్, వికాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్ల మెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు డీఈవో కళ్యాణి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియాతో సమావేశం ఆమె మాట్లాడారు ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీ క్షలు ఈ నెల 22వ తేదీ నుండి 29వ తేదీ వరకు నిర్వ హించటం జరుగు తుందని. ఇంటర్ ప్రథమ సంవ త్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యా హ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీ క్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల ఉంటాయని ఇందుకోసం జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పా టు చేసినట్లు అందులో జై నూర్, కాగజ్‌నగర్. కౌటాల. కెరమెరి. ఆసిఫాబాద్‌ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఆసిఫా బాద్ లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాల. కాగజ్‌న గర్ పట్టణంలోని వసుంధర జూనియర్ కళా శాలలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# పోడు సమస్య పరిష్కరించండి

**కడెం, మే 19 (ప్రభాత సమాచారం)**

పట్టాలు లేని పోడు భూముల సమస్య పరిష్కరించాలని మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పలు వురు రైతులు కోరారు. కలెక్టర్ అభిలాష అభినవ్‌కు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు సోమవారం వినతి పత్రాలు అందించారు. పోడు రైతులకు మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ మాట్లాడుతూ ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను స్వా ధీనం చేసుకుంటామని అటవీశాఖ ప్రకటిం చడం సరి కాదన్నారు. వెంటనే ఈ ప్రక్రియ నిలిపివేయాలన్నారు. శేఖర్, ప్రతాప్, లచ్చన్న, ఆనంద్ పాల్గొన్నారు.

# 'ఉల్లాస్' సర్వే పకడ్బందీగా చేపట్టాలి



**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

ఉల్లాస్ సర్వే పకడ్బందీగా నిర్వ హించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఓ పెన్ స్కూల్, ఉల్లాస్, ఆరోగ్య పాఠశాల తది తర కార్యక్రమాల అమలుపై సంబంధిత అధి కారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిం టికి వెళ్లి వయస్సుతో నిమిత్తం లేకుండా లర్నర్స్‌ను ర్ను గుర్తించి వారి వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ రోజు 25 ఇళ్లు సర్వే చేస్తూ ఈ నెలాఖరు నాటికి సర్వే పూ ర్తి చేసి నివేదిక అందజేయాలన్నారు. బడుల ప్రారంభానికి ముందే స్కూల్ యూనిఫాం స్టి చింగ్ పూర్తి చేయాలన్నారు. బడి మానేసి హొ టళ్లు, రెస్టారెంట్లు, దాబా ల్లో పనిచేస్తున్న పిల్లల ను గుర్తించి బడిలో చేర్పించాలని లేబర్ అధి కారిని ఆదేశించారు. పదో తరగతిలో ఫెయిలై న విద్యా ర్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిం చడంతో పాటు, అభ్యాస దీపికలు అందజేసేలా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీఎంహెచ్ వో రాథోడ్ నరేందర్, డీడబ్ల్యూవో మిల్కా, డీఐఈవో జాదవ్ గణేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**

వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ అన్నారు. సోమ వారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ అధికా రులతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ పై సమీక్ష ఎ సమావేశం నిర్వహించారు. రాజీకాదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు. ఇ –పిటి కేసుల వివరాలను ఠాణాల వారిగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరి ష్కారానికి అందరు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈసారి జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్య ధిక కేసులను పరిష్కరించడం ద్వారా ఆసిఫాబాద్ జిల్లా ను ఉన్నత స్థానంలోకి తీసుకురావడం కోసం పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో దరఖాస్తుదారులకు న్యాయం జరగాలని సూచించారు.



## బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్
# పార్టీని బలోపేతం చేయాలి

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవాని

**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవాని అన్నారు. జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు అలకలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ జిల్లాలోని 90,026 బూత్‌లలో కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. నిర్మల్, కడెం, ఖానాపూర్ తదితర మండలాల్లో బూత్ కమిటీలు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో మిగతా కమిటీలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్‌ను నిర్మాణం చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడానికి పార్టీ అధిష్ఠానం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతం కృషి చేయాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అపర్ణ, కార్యదర్శి మౌనిక, జిల్లా నాయకులు సుశీల, వసంత, సంగీత, నుస్రత్ బేగం తదితరులు పాల్గొన్నారు.



### ఆర్థిక ఇబ్బందులతో
## రైతు బలవన్మరణం

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**
ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరగిరి గ్రామానికి చెందిన కొక్కుల లచ్చన్న(52) కొంతకాలంగా తమకున్న మూడె కరాలతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది పత్తి సాగు చేయగా సరైన దిగుబడి రాలేదు. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పు, సాగుకు తెచ్చిన పెట్టుబడి కలిపి సుమారు రూ.5లక్షల వరకు ఉందని, వాటిని ఎలా తీర్చాలో అంటూ కొంతకాలంగా మదనపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన సోమవారం వేకువజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని శ్మశానవాటిక వద్ద ఉన్న మోదుగు చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు వెంకటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రమ్య తెలిపారు.

### హత్యాయత్నం కేసులో
## నిందితులకు ఐదేళ్ల జైలు

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**
మహిళపై హత్యాయత్నానికి పాల్పడ్డ ఇద్దరు నిందితులకు ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు, రూ. 1,000 చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించారు. లైజన్ అధికారి జి.పండరి తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది ఏప్రిల్ 20న ఇచ్చోడ మండలం బోరిగామ గ్రామంలో రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన బుర్ర విజయ్ కుమార్, షేక్ మీనాజ్ అహ్మద్ కలిసి మహిళపై కత్తితో దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదు చేశారు. ప్రత్యేక పీజీ ఎం.మధుకర్ సాక్షులను విచారించి నేరాన్ని రుజువు చేయటంతో నేరస్తులు ఇద్దరికీ న్యాయమూర్తి శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పును ఖరారు చేశారు.

## 21న సింగరేణి పాఠశాల సర్ణోత్సవాల లోగో ఆవిష్కరణ

**మందమర్రి, మే 19 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకల లోగోను బుధవారం పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సింగరేణి అధికారులు ఆవిష్కరించనున్నారని పాఠశాల కరస్పాండెంట్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే పురుషోత్తంలు తెలిపారు. బుధవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి శ్రీనివాస్ రావు, స్థానిక ఏరియా జీఎం జి దేవేందర్ లు హాజరై, లోగోను విడుదల చేయడంతో పాటు స్వర్ణోత్సవాలకు సంబంధించిన కార్యక్రమం వివరాలు, తేదీని సైతం వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రస్తుత, పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలన్నారు.

## అహల్యబాయి హోల్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**
రాణి అహల్యాబాయి హోల్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకను పట్టణంలోని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర పార్టీ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ మొఘలుల కాలంలో ధ్వంసమైన హిందూ దేవాలయాలను పరిరక్షణకు రాణి అహల్యాబాయి హోల్కర్ కృషి చేశారన్నారు. ఆమె హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి, హిందువులను సంఘటితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రామ్‌నాథ్, జిల్లా కన్వీనర్ అలివేలుమంగ, రాష్ట్ర నాయకురాలు ఆడె లలిత, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వైద్య రజిని, ముథోల్ కన్వీనర్ సీరం సుష్మారెడ్డి, ఖానాపూర్ కన్వీనర్ సత్యవతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి పాల్గొన్నారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**
పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 7 సెంటర్లలో 2,292 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందులో జనరల్ 2,057 మంది, ఒకేషనల్ 235 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఫస్టియర్ ఉదయం 9 నుంచి 12:30 వరకు సెకండియర్ మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు నిర్వహిస్తారన్నారు. జూన్3 నుంచి 13వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి...**
విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకుదీటుగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

**బెల్లంపల్లి :** బెల్లంపల్లి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. టూటౌన్ ఎస్సై కే.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి ఏరియా కాసిపేటగనిలో కోల్ కట్టర్ బానోత్ పృథ్వీరాజ్ ఆదివారం మధ్యాహ్నం మోటార్సకిల్పై తాండూర్కు వెళ్లాడు. అక్కడి నుంచి మందమర్రికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో బైపాస్ రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ఎదురుగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. పృథ్వీరాజ్ కాలు పాదం వద్ద నుజ్జునుజ్జయింది. స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్కు, అక్కడి నుంచి సోమవారం హైదరాబాద్కు తరలించారు. బాధితుడి భార్య దివ్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.



## విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి

**కెరమెరి, మే 19 (ప్రభాత సమాచారం)**
నెలరోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని వార్డు నెంబర్ 1 కి చెందిన వినియోగదారులు సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడంలేదన్నారు. ప్రస్తుతం సబ్ స్టేషన్‌కు వచ్చినప్పటికీ బాధ్యత గల అధికారులెవరూ లేరన్నారు. స్థానికంగా ఉండాల్సిన అధికారులు జిల్లా కేంద్రాల్లో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఏఈ రమేశ్ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సుధాకర్, ఫాజిల్, ఇలియాజ్, అహ్మద్ పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**బెల్లంపల్లి, మే 19 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణ పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ, పాలకవర్గం గౌరవ అధ్యక్షులుగా జి ఏ జ్యోతి కుమార్, సలహాదారులు ఏలుపుల కనకయ్య, అధ్యక్షులు గొడిసెల శ్రీహరి, ఉపాధ్యక్షురాలు అక్కు ఉమ, ఉపాధ్యక్షులు దూబాసి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్-గోడిసెల స్వామి, ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, సహాయ కార్యదర్శి అక్కు కృష్ణ, సహాయ కార్యదర్శి లింగంపెల్లి రాజన్న, కోశాధికారి డీఆర్ శ్రీధర్, ప్రచార కార్యదర్శి గొడిసెల చంద్ర మౌళి, ప్రచార కార్యదర్శి జంజర్ల రవిరాజ్, సంయుక్త కార్యదర్శి ఉంద్రాల రవి లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు గా వెల్తూరి శంకర్, గొడిసెల రేణుక, గొడిసెల సరిత,జిల్లా రజిత, గుడిసెల శారద, జంజర్ల శ్రీలత, దుబాసి లలిత, రాచకొండ ప్రసాద్, రాచకొండ మంజుల,ఎంజల కుమార్, జంగం డాక్టర్, పెరుగు రవి, శ్రీధర్, శ్రీలత, ప్రకాష్, చంద్రయ్య, శనిగారపు వెంకన్న, మాడుగుల శంకర్‌లను నియమించారు.



# అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**ఏసీబీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి**




**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**
సమాజంలో నెలకొన్న అవినీతి నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో ముఖ్యమని ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ టౌన్‌షిప్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి రైలు మార్గం ద్వారా ఇక్కడకు చేరుకున్న తరుణ్ జోషికి ఏసీబీ, పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తరుణ్ జోషి మాట్లాడారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల కేసులకు సంబంధించి ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చునన్నారు. నిరంతరం అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇది వరకు ఆదిలాబాద్‌లో కార్యాలయం ఉన్నందున ఇక్కడి నుంచి వచ్చే ఫిర్యాదు దారులు ఇబ్బందులు పడ్డారని, అంతేగాకుండా కేసుల పరిశోధనలో అధికా రులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు కలిపి ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎవరైన లంచం అడిగితే వారిపై వెంటనే ఫిర్యాదు చేయవచ్చునని తరుణ్ జోషి సూచించారు. 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేసే సౌకర్యం ఉందన్నారు. దీంతో పాటు వెబ్ సైట్‌లో కూడా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించామన్నారు. బాధితులు కాల్ చేసిన వెంటనే రికార్డు చేసుకొని కేసును పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాదేశ్యాం మురళి, రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, కరీంనగర్ ఏసీబీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతి, మంచిర్యాల, కరీంనగర్ డీఎస్పీలు విజయ్‌కుమార్, రమణమూర్తి, సీఐలు కిరణ్‌కుమార్, క్రిష్ణకుమార్, ఏసీబీ, పోలీస్ అధికారులు, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రయాణికులకు మెరుగైన సేవలు

**ఆర్టీసీ ఎండీ సజ్జనార్ - ఆదిలాబాద్ డిపో సందర్శన**

**ఆదిలాబాద్, మే 19 (ప్రభాత సమాచారం)**
ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. ఆదిలాబాద్ డిపోను సోమవారం ఆయన సందర్శించారు. ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా డిపో ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకంతో మహిళలు ఎంతగానో లబ్ధి పొందుతున్నారన్నారు. ఆర్టీసీలో ప్రయాణించేటప్పుడు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే అవసరం మేరకు ప్రతీ గ్రామానికి బస్సు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన బ స్సులను సైతం కొనుగోలు చేస్తున్నామని, పర్యావరణహిత ఎలక్ట్రిక్ బస్సులను సైతం పలు రీజియన్లలో ప్రవేశపెట్టామన్నారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటు విషయంలో దూరం సమస్యగా మారిందన్నారు. నిజామాబాద్‌లో చార్జింగ్ పాయింట్‌తో అనుసంధానం చేస్తే ఎలక్ట్రిక్ బస్సులు నడపవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట డిపో మేనేజర్ కల్పన తదితరులు ఉన్నారు.

# 'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

**- కదిలించిన కథనం..**
**- ప్రభాత సమాచారం కథనానికి స్పందన**
**- ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో**




ఉపాధి హామీ.. ఏదీ జవాబుదారీ?

ఉపాధి హామీ కూలీలపై 'ప్రభాత సమాచారం'లో ప్రచురితమైన కథనం

**కుభీర్, మే 19 (ప్రభాత సమాచారం)**
ఇటీవల 'ప్రభాత సమాచారం' దినపత్రికలో 'ఉపాధి హామీ.. ఏదీ జవాబుదారీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనం అధికారులను కదిలించిది.. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సోమవారం కుభీర్ ఎంపీడీవో సాగర్ రెడ్డి సోమవారం కుభీర్ మండలం పల్సి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీలు తక్కువగా ఉండటంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులకు కూలీలు తక్కువగా రావడానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు వంద రోజుల పనికల్పించాలన్నారు. అందుకుగాను ప్రతిరోజూ కూలీలు ఎక్కువ శాతం హాజరయ్యేలా కూలీల సంఖ్యను పెంచాలని, గ్రామస్తులకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా మండలంలో ఉపాధి హామీ పనుల ద్వారా ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఉపాధి సిబ్బంది సమన్వయంతో పనులు చేసేవారిని గుర్తించి అందరికీ పనులు కల్పించడంతో పాటు వారు చేసిన పనులకు ఇవ్వాల్సిన డబ్బులను సకాలంలో అందించాలన్నారు. ఇకపై కూలీల సంఖ్య తగ్గితే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎంపీఓ మోహన్ సింగ్, పంచాయతీ సెక్రటరీ పాండు సింగ్, తదితరులున్నారు.

## నేడు మంత్రి 'పొంగులేటి' రాక



**మంచిర్యాల, మే 19 (ప్రభాత సమాచారం)**
భూభారతి చట్టంపై మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించనున్న అవగాహన సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా స్ రెడ్డి హాజరు కానున్నారు. సదస్సు నిర్వహించే పాఠశాల ప్రాంగణాన్ని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, కలెక్టర్ కుమార్ దీ పక్, డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వ ర్లు, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, డీఆ ర్డీవో కిషన్ సోమవారం వేర్వేరుగా సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. సదస్సుకు హాజ రయ్యే రైతులకు మంచినీటితోపాటు మజ్జిగ అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు.

**ఎస్టీపీపీలో హెలిప్యాడ్ పరిశీలన...**
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం జిల్లా పర్యటన నేపథ్యంలో స్థానిక ఎస్టీపీపీలోని హెలిప్యాడ్ స్థలాన్ని సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. ఉదయం 9:50గంటలకు ప్లాంటుకు హెలికాప్టర్ ద్వారా చేరుకుని ఇక్కడి నుంచి రోడ్డుమార్గంలో భీమారం వెళ్తారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## రైతు సంక్షేమానికి ఆత్మ కమిటీలు

**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**
రైతుల సంక్షేమం కోసం ఆత్మ కమిటీలు పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని రైతు వేదికలో ఆత్మ కమిటీ చైర్మన్‌గా రాంరెడ్డి, 27 మంది డైరెక్టర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా శ్రీహరిరావు హాజరై మాట్లాడారు. రైతులకు ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆత్మకమిటీపై ఉందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా, మద్దతు ధరపై రూ.500 బోనస్ వంటి పథకాలు రైతుల జీవితాలను మెరుగుపరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



**తప్పుడు మరణ ధ్రువీకరణ**

## పత్రాలపై కఠిన చర్యలు

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, మే 19 (ప్రభాత సమాచారం)**
తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ప్రభుత్వ పథకాల ద్వారా అక్రమంగా లబ్ధి పొందే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. జిల్లాలో కొన్ని చోట్ల పథకాల లబ్ధి కోసం కొందరు వాస్తవాలకు విరుద్ధంగా మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ దుశ్చర్యలను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు శాఖలతో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇలాంటి తప్పుడు ధ్రువీకరణ పత్రాల నిర్ధారణ కోసం గ్రామ, వార్డు స్థాయిలలో సమగ్ర తనిఖీలు చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులు, వాటిని వినియోగించి లబ్ధి పొందినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.